
సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం : 29 : జూలై : 2023



నీటివిడుదల నిలిపివేత

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీలోకి నీటి విడుదలను శుక్రవారం నిలిపివేశారు. ప్రస్తుతం మిడ్‌మానేరులో నీటిమట్టం 19.66 టీఎంసీలకు చేరింది.



ప్రతి రోజు డ్రై డే

సిరిసిల్లటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి రోజు డ్రై డే పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు తెలిపారు. ఆగస్టు 10 లోపు ప్రసూతి అయ్యే గర్భిణుల జాబితా జిల్లా ఆస్పత్రికి పంపించాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం

28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులు

- వేములవాడ ఆలయ ఈవోగా గంగయ్య
- డీఆర్‌డీవోగా నక్క శ్రీనివాస్
- భూసేకరణ విభాగం ప్రత్యేక కలెక్టర్‌గా సదానందం



గంగయ్య శ్రీనివాస్ సదానందం

సిరిసిల్ల: జిల్లాలో పదోన్నతి పొందిన డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బొద్దుల గంగయ్యను డిప్యూటీ కలెక్టర్ హోదాలో వేములవాడ ఆలయ ఈవోగా నియమించారు. వేములవాడ ఆర్డీవో ఆఫీస్ అడ్మినిస్ట్రేసన్ ఆఫీసర్ నక్క శ్రీనివాస్‌ను ఆర్డీవోగా పదోన్నతి కల్పించి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్‌డీవో)గా నియమించారు. తంగళ్లపల్లి తహసీల్దార్ పి.సదానందంను డిప్యూటీ కలెక్టర్ హోదాలో సిరిసిల్ల భూసేకరణ ఎస్‌డీసీగా బదిలీ చేశారు.

దెబ్బతిన్న కల్వర్టులపై నివేదిక



బోయినపల్లి(చొప్పదండి): వరదతో దెబ్బతిన్న కల్వర్టులపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్ తెలిపారు. మండలంలోని బోయినపల్లి–మర్లపేట కల్వర్టు, రామన్నపేట–అయ్యోరిపల్లి, వేములవాడ బీటీరోడ్డు, బోయినపల్లి, స్తంభంపల్లి గంజివాగు కల్వర్టులను ఎంపీపీ వేణుగోపాల్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. పీఆర్ డీఈ సత్యనారాయణ, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య పాల్గొన్నారు.

ఎగువమా‘నీటి’కి కొండూరు పూజలు



గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శుక్రవారం సందర్శించారు. కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. త్వరలోనే కాలువల ద్వారా ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. సర్పంచ్ ఎడబోయిన రాజు, ఆర్‌బీఎస్ మండలాధ్యక్షుడు రాజేందర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సిరిసిల్లఅర్బన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం కలెక్టరేట్ ఏవో గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయినా ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 2017 నుంచి ఇప్పటి వరకు వేతనాలు పెంచకపోవడంతో చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కడారి రాములు, గుంటి వేణు, అజ్జ వేణు, మార్వాడి సుదర్శన్, మంత్రి చంద్రయ్య, రమేశ్, నాగరాజు, కిశోర్ ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని సీఐ శశిధర్‌రెడ్డి కోరారు. మండలంలోని కోరుట్లపేటలో శుక్రవారం పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్‌మోసాలు, దొంగతనాలపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ దేవానందం, ఎంపీటీసీ మధు పాల్గొన్నారు.



సిరిసిల్ల నేతన్నచౌక్ వద్ద బురద



జలమయమైన శ్రీనగర్‌కాలనీ



పద్మనగర్‌లో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



జలమయమైన శాంతినగర్‌కాలనీ

కబ్జాలే ముంచాయి!

- చెరువులను ‘చెర’బట్టారు
- రెండేళ్లలో నాలుగుసార్లు మునిగిన సిరిసిల్ల

- ఆగిన వరద.. మిగిలిన బురద
- పాఠం నేర్వని పాలకులు
- ముంపు ముప్పు తప్పేదెప్పుడో?

సిరిసిల్ల: చిన్నపాటి వర్షానికే సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. సిరిసిల్ల పాతబస్టాండ్ ఏరియా మునిగిపోతుంది. చినుకు పడితే చాలు వణికిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండేళ్లలో సిరిసిల్ల పట్టణం నాలుగుసార్లు మునిగింది. అయినా పాలకులు, అధికారులు పాఠాలు నేర్వలేదు. ఊరును ముంచెత్తుతున్న వరదలకు కారణాల మూలాల్లోకి వెళ్లకుండా నిధులను నీళ్లలా ఖర్చుచేసేస్తున్నారు. ఫలితంగా సిరిసిల్ల పట్టణం గుండె మరోసారి చెరువైంది. తాజాగా చిన్నబోనాల చెరువు తెగడం.. ఏటా ఏదో కారణంగా సిరిసిల్లకు ముంపు తప్పడం లేదు.

నిధులు నీళ్లప్రాయం

సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి రూ.కోట్ల నిధులు మంజూరు చేయిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాటిని సరైన విధంగా వినియోగించకనే వరద ముప్పు తప్పడం లేదు. ఏనాడు జిల్లా స్థాయి అధికారులు వరద ముంపును తప్పించే పనులు ఎలా జరుగుతున్నాయని సమీక్షించిన పాపాన పోలేదు.

- సిరిసిల్ల పాత బస్టాండు ముందు మురికినీటిని రోడ్డు దాటించేందుకు రూ.40 లక్షలతో కల్వర్టు కట్టారు. ఓ మాజీ ఎంపీపీ భర్త ఈ పనులు చేశారు. నిర్మాణ లోపమో.. డిజైన్ లోపమో కానీ.. లక్ష్యం నెరవేరలేదు. ప్రధాన రోడ్డును పెద్దగా తవ్వి.. చిన్నగా కల్వర్టు కట్టారు. కానీ ఫలితం నెరవేరలేదు.
- శాంతినగర్‌లో గాజుల బాలయ్య ఇంటి ముందు రూ.18లక్షలతో కల్వర్టు కట్టగా వరదలకు కొట్టుకుపోయింది. మురికికాల్వ, సిమెంట్ రోడ్డు, కల్వర్టు వరద పాలైంది.
- రాజీవ్‌నగర్, ముష్టిపల్లి నుంచి వచ్చే వరద నీటిని కొత్తచెరువులోకి నేరుగా చేరేలా రూ.6.21 కోట్లతో చేపట్టిన పనులు పూర్తిచేయాలి. కానీ ఆ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.
- సాయినగర్ నుంచి శాంతినగర్ వరకు ఉన్న ప్రధాన మురికికాల్వలో పేరుకున్న పూడికను తొలగించాలి. ఓపెన్ డ్రెయిన్‌లో పూడిక తీసేందుకు రూ.8 లక్షలతో చేపట్టిన పనులు ఇంకా పూర్తికాలేదు.



వెంకంపేటలో బిల్డింగ్ కింద బేస్‌మెంట్ కొట్టుకుపోయిన దృశ్యం

చెరువులు, కుంటలు మాయం

సిరిసిల్లలో కొత్తచెరువు, కార్గిల్‌లేక్ మినహా మిగతా చెరువులు, కుంటలు కనుమరుగయ్యాయి. కొత్తచెరువును ఆధునీకరణ పేరిట సగం మేరకు పూడ్చివేయడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. ఫలితంగా శాంతినగర్ ప్రాంతం జలదిగ్బంధంలోకి వెళ్తుంది. కొత్తచెరువులోకి రాజీవ్‌నగర్, జేపీనగర్, ముష్టిపల్లి, చంద్రంపేట పరిసరాల నుంచి వచ్చే వరద నీటి దిశను మళ్లించారు. దీంతో ఆ వరదనీరు సిరిసిల్లలోని వీధులను ముంచెత్తుతుంది. కొత్తచెరువు మత్తడి కబ్జాకు గురైంది. ఫలితంగా కరీంనగర్, వేములవాడ, కోనరావుపేటకు వెళ్లే ప్రధాన రహదారి జలమయం అవుతుంది. ముష్టిపల్లి శివారులోని ఈదులచెరువు కబ్జాకు గురైంది. 2021లో నాలాలు, వరదకాల్వల కబ్జాలను తొలగించాలని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. నెల రోజుల్లోనే మళ్లీ ఆక్రమణల తొలగింపును నిలిపివేశారు. రాజకీయ నేతల అభ్యంతరాలతో కబ్జాల తొలగింపులు నిలిచిపోయాయి.

నాలుగుసార్లు ముంపు

సిరిసిల్ల పట్టణం రెండేళ్లలో నాలుగుసార్లు ముంపునకు గురైంది. 2021 సెప్టెంబరు 6, 7 తేదీల్లో కురిసిన భారీ వర్షంతో తొలిసారి ముంపునకు గురైంది. సిరిసిల్లకు వరదముప్పు ఉందని గుర్తించిన అధికారులు నివారణకు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. రెండోసారి 2022 జూలై 11న వరదనీరు సిరిసిల్లను ముంచెత్తింది. వరదనీరు ఎక్కువగా రావడంతో కొత్త చెరువులో నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపిస్తున్నారు. ఆ నీరు ఊరును ముంచెత్తకుండా కొత్తచెరువు కింద ఏకంగా వేములవాడ రోడ్డును తవ్వేశారు. శాంతినగర్‌లో ఏనాడో కట్టాల్సిన మురికికాల్వ మళ్లింపు పనులు ఆలస్యంగా మొదలుపెట్టారు. మూడోసారి 2022 సెప్టెంబరు 12న సిరిసిల్ల ముంపునకు గురైంది. ఇలా ఇప్పటికే మూడుసార్లు వరదలో చిక్కగా.. నాలుగోసారి గురువారం మునిగింది. సిరిసిల్ల ముంపును ముందే హెచ్చరిస్తూ ‘సాక్షి’లో జూన్ 12న ‘ముంపు ముప్పు తప్పేనా..?’ కథనం ప్రచురితమైంది. అయినా వర్షాలను అంచనా వేయడంలో పాలకులు పాఠం నేర్వలేదు.

తగ్గిన వరద.. వదలని బురద

జిల్లా కేంద్రంలో శుక్రవారం వరదలు తగ్గాయి. అయితే వరదలతో వచ్చిన బురద అలాగే ఉంది. బాధితులు ఆ బురదను తొలగించే పనుల్లోనే ఉన్నారు. రోడ్లు తెగిపోయి, కల్వర్టులు కూలిపోయి, మురికికాల్వల్లో చెత్త పేరుకుపోయి ఉంది. ఇప్పటికైనా మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆక్రమణలను తొలగిస్తేనే సిరిసిల్లకు ముంపు ముప్పు తప్పుతుంది.

చెరువు పేరు	సర్వేనంబర్	విస్తీర్ణం(ఎకరాలలో)	ఎవరి ఆధీనం
కొత్త చెరువు	1471	85.05	నీటిపారుదల, రెవెన్యూ
రాయిని చెరువు	703	152.10	పూడ్చి వేశారు
ఈదుల చెరువు	991	77.29	రెవెన్యూ
అర్జునకుంట	757	23.36	రెవెన్యూ
దేవునికుంట	1121	9.28	రెవెన్యూ
మైసమ్మకుంట	1294	11.02	రెవెన్యూ
దామెరకుంట	232, 233	7.38	నీటిపారుదల, రెవెన్యూ
తుమ్మలకుంట	142, 143	29.23	పూడ్చివేశారు
వర్ధనికుంట(కార్గిల్‌లేక్)	లేవు	లేదు	నీటి పారుదల

స్పందన భేష్

చిన్నబోనాల చెరువుకు గండి పడడంతో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించిన తీరు బాగుంది. ప్రజలను అప్రమత్తం చేస్తూ.. విద్యుత్ సరఫరా నిలిపివేసి ప్రభావిత ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆదేశాలతో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రాణనష్టం లేకుండా కట్టడి చేశారు. ట్రాక్టర్లలో బాధితులను తరలించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ స్థానికుల సహకారంతో బాధితులకు అండగా నిలిచారు. మరోవైపు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో ఆనంద్‌కుమార్ క్షేత్రస్థాయిలో చెరువు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సిబ్బంది వరద ప్రభావిత ప్రాంతాల్లో శ్రమించారు. వరదల్లో అధికారులు స్పందించిన తీరుకు ప్రజల నుంచి అభినందనలు లభించాయి.



మామిడిపల్లిలోని పొలాల్లో పేరుకుపోయిన ఇసుక



ఇసుక, మట్టితో నిండిపోయిన పొలం

పొలాల్లో ఇసుకమేటలు

కోనరావుపేట/బోయినపల్లి(వేములవాడ): వరుసగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పంటపొలాలు నీటమునిగాయి. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లిలో పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. బోయినపల్లి మండలం కోరెంలో పంట పొలాలు నీటమునిగాయి.

చెరువులను అభివృద్ధి చేస్తాం

- కట్టలపై ఒత్తిడి తగ్గేలా గేట్లు అమర్చుతాం
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- సిరిసిల్ల చెరువులు, లోతట్టు ప్రాంతాలు పరిశీలన



కొత్తచెరువు కట్టను పరిశీలిస్తున్న కలెక్టర్, చైర్‌పర్సన్‌లు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల చుట్టూ ఉన్న చెరువులు కోతకు గురికాకుండా అభివృద్ధి పనులు చేపడతామని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. భారీ వర్షాలతో తెగిన బోనాల చెరువుతోపాటు సిరిసిల్ల కొత్తచెరువు, బామన్‌కుంట, చంద్రంపేట ఈదులచెరువు, పెద్దబోనాల చెరువులను మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించి అధికారులతో మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే వరదతో చెరువులపై ఒత్తిడి తగ్గించేలా గేట్లు ఏర్పాటు చేస్తామని, గొలుసుకట్టు చెరువులు, కాల్వలు, నాలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో చెరువుల నుంచి వచ్చే వరదలతో సిరిసిల్ల పట్టణ ప్రజలకు సమస్యలు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ వర్ష సూచనలు ఉన్నాయని శిథిలావస్థ ఇళ్లల్లో ఉండొద్దని కోరారు. మున్సిపల్ కమ్యూనిటీహాల్స్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

1286 టీఎంసీలు గంగపాలు

- ఇప్పటి వరకు సముద్రంలోకి విడుదల చేసిన నీరు
- భారీ వరదలనూతట్టుకునేలా ప్రాజెక్టులు
- ఎల్లంపల్లి, ఎల్‌ఎండీ, మిడ్‌మానేరుకు లక్షల క్యూసెక్కుల వరద
- ఫలించిన ముందస్తు చర్యలు, ఉమ్మడి జిల్లాలో ఒకేమరణం

ఏడాదికాలంలో వదిలిన టీఎంసీలు	
ఎల్లంపల్లి	1,182 టీఎంసీలు
మిడ్‌మానేరు	56 టీఎంసీలు
ఎల్‌ఎండీ	48.5 టీఎంసీలు
మొత్తం	1,286 టీఎంసీలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర చరిత్రలో మును పెన్నడూ చూడని భారీ వర్షాలు ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేశాయి. గోదావరి, మానేరు పొంగిపొర్లాయి. ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. వర్షం ఆగినా ఎగువ నుంచి వస్తున్న వరద వచ్చింది వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. ఏడాదికాలంలో దాదాపు 1200 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలోని మధ్యమానేరు, దిగువమానేరు, ఎల్లంపల్లి వీటితోపాటు ఎగువమానేరు ప్రాజెక్టుల్లో కలిపి 51 టీఎంసీల మేరకు నిలువ ఉంచుకునే వీలుంది. కానీ, రెండేళ్లుగా పరిమితికి మించి వరద వస్తోంది. ఏకంగా లక్షల క్యూసెక్కుల వరద రావడం, అంతే స్థాయిలో విడుదల చేయడం ఏటా పెరుగుతోంది.

మన ప్రాజెక్టులు గట్టివి..

ఉమ్మడి జిల్లాలో గురువారం కురిసిన వర్షం కనీవినీ ఎరుగనిది. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్యాలలో ఏకంగా 38 సెం.మీల వర్షం కురవడం సరికొత్త రికార్డు. సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలో పల్లెలు చిగురుటాకులా వణికాయి. మంథని, ధర్మపురి, సిరిసిల్ల పట్టణం, జమ్మికుంటలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. ఎగువ, దిగువ మానేరు ప్రాజెక్టులతోపాటు ఎల్లంపల్లికి భారీగా వరద నీరు వచ్చింది. ముఖ్యంగా కడెం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ, ఎగువన కురిసిన వర్షాలతో ఎల్లంపల్లికి వరద పోటెత్తింది. కడెం ప్రాజెక్టు మీదుగా వరద ప్రవహించడంతో మన ప్రాజెక్టులు ఎంతవరద తట్టుకుంటాయి? అన్న ప్రశ్న అందరిలోనూ మొదలైంది. దీనికి అధికారులు తమ సమాధానంతో భరోసా ఇచ్చారు. ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకోగలదని, అదే మిడ్‌మానేరు ప్రాజెక్టు 5.08 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకోగలదని ఎస్సారెస్పీ అధికారులు వెల్లడించారు. మరోవైపు గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి సామర్థ్యం ఈ రెండు ప్రాజెక్టుల కన్నా అత్యధికం. ఇది ఏకంగా 19.5 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకుని నిలబడగలదని అధికారులు స్పష్టం చేశారు. ఆ స్థాయిలో వరదలు వచ్చే అవకాశాలు దాదాపుగా లేవని తెలిపారు.

ఒక మరణం.. పంటనష్టం సర్వే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు చేపట్టిన ముందు జాగ్రత్త చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయి. కోరుట్లలో బాత్రూం గోడ కూలి వివాహిత మరణం మినహా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా మరణాలు, గల్లంతులు చోటుచేసుకోలేదు. మంథనిలో ఇసుక రీచ్‌లో చిక్కుకుపోయిన వారిని పోలీసులు రక్షించిన సంగతి తెలిసిందే. పలు చోట్ల డీఆర్‌ఎఫ్ టీంలు మోహరించడం, తెగిపోయిన రోడ్ల వద్ద బందోబస్తు పెట్టడంతో ప్రాణనష్టం నివారించగలిగారు. వర్షం తెరిపినిచ్చిన దరిమిలా వ్యవసాయ అధికారులు శనివారం నుంచి సర్వే ప్రారంభించనున్నారు.

క్లుప్తంగా

తురకకాశి కుటుంబాలకు 'డబుల్' ఇళ్లు ఇవ్వండి



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తురకకాశి కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మండలంలోని దుమాలకు చెందిన 20 కుటుంబాలు వర్షాలకు ఇబ్బంది పడుతున్నట్టు తెలుసుకొని శుక్రవారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ కూలి పని చేస్తూ బతికి తురకకాశీ కుటుంబాలు గుడిసెల్లో ఉంటున్నాయని, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు ఎన్నోసార్లు ప్రయత్నించినా స్థానిక నాయకులు కలవనీయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు అనవేని రవి, నాయకులు చెన్ని బాబు, గంట బుచ్చాగౌడ్, రామ్‌రెడ్డి, కొత్తపల్లి దేవయ్య, బానోతు రాజునాయక్, భాను తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయుని నుంచి పట్టుదల నేర్చుకోవాలి



ప్రవచనాలు వినిపిస్తున్న రఘురామశర్మ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మార్కండేయుని జీవితం నుంచి పిల్లలు పట్టుదల నేర్చుకోవాలని పండితులు రాచర్ల రఘురామశర్మ పేర్కొన్నారు. సత్సంగ సదనంలో కొనసాగుతున్న అధిక మాస దివ్య ప్రబోధ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మార్కండేయ పురాన ప్రవచనం గావించారు. రఘురామశర్మ మాట్లాడుతూ భగవంతునిపై విశ్వాసం, అనుకున్నది సాధించడంలో చూపాల్సిన పట్టుదల మార్కండేయ కథ నుంచి నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, లక్ష్మమ్మ, భక్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇళ్ల కూలిపోయిన బాధితులకు శుక్రవారం నిత్యావసర సరుకులను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్ పంపిణీ చేశారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఎల్లారెడ్డిపేటకు చెందిన ముదం నడిపి ఎల్లయ్య, బీపేట భూమయ్య ఇళ్లు కూలిపోయాయి. వారు ప్రస్తుతం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉంటున్నారు. వారికి బియ్యంతోపాటు నిత్యావసర వస్తువులను అందించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, పట్టణాధ్యక్షుడు చెన్ని బాబు, గంట బుచ్చాగౌడ్, బీపేట రాజు పాల్గొన్నారు.



ఈమె సిరిసిల్లలోని అంబికానగర్‌కు చెందిన సింగం మణెమ్మ(70). మణెమ్మకు భర్త లేరు. ఒక్క కూతురు షోలాపూర్‌లో ఉంటుంది. భీవండిలో ఉండే సోదరుడు వెంకటేశ్ సిరిసిల్లకు వచ్చి మణెమ్మతోనే కలిసి ఉంటున్నాడు. ఆసరా పెన్షన్, రేషన్‌బియ్యంతో కాలం వెల్లదీస్తున్నారు. అనూహ్యంగా వరదలు రావడంతో అధికారులు ఆమెను కొత్తబస్టాండులోని సినారె కళామందిరంలోని పునరావాస కేంద్రంలో ఉంచారు. అధికారులు అందించే భోజనం ప్యాకెట్లు తింటూ.. తమ్ముడు వెంకటేశంతో ఉంటుంది. అంబికానగర్‌లో బురద తగ్గితే.. అక్కడికి వెళ్తానంటుంది.



దీనంగా చూస్తున్న ఇతను ఉప్పుల సిద్ధరాములు(55). సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వీరాపురం గ్రామానికి చెందిన సిద్ధిరాములు సిరిసిలలో పవర్‌లూమ్ కార్మికుడు. ముప్పై ఏళ్లుగా సిరిసిల్లలో సాంచాలు నడుపుతూ, సోదరుడు నరహరి ఇంట్లో ఉంటున్నాడు. గురువారం సాయంత్రం వరదలు రావడంతో ఇంట్లోకి నీరు రావడంతో పునరావాస కేంద్రానికి పోలీసులు తరలించారు. భార్య అనసూర్య వాళ్ల పుట్టింట్లో ఉండగా... కొడుకు మధు దుర్శేడులో పనిచేస్తాడు.



ఇతను పోగుల రాజు(50). జిల్లా కేంద్రంలోని వెంకంపేటలో సాంచాలు నడుపుతుంటాడు. పొట్టకు పెట్టే ఇంట్లో (కార్మికుల మెస్)లో తింటూ పనిచేస్తున్నాడు. పని చేసిన రోజు రూ.350 నుంచి రూ.400 వస్తాయి. భార్య రేణుక బీడీలు చేస్తుంది. టెక్స్‌టైల్‌పార్క్‌లో కిరాయికి ఉంటారు. వరదల్లో చిక్కడంతో సినారె కళామందిరంలో తలదాచుకుంటున్నారు. పనిచేసే చోట వరదలు రావడంతో ఇలా పునరావాస కేంద్రంలో ఉంటున్నాడు. ఇలా 70 మంది నిరాశ్రయులను సిరిసిల్ల పోలీసులు, మున్సిపల్ సిబ్బంది స్థానిక సినారె కళామందిరంలోని పునరావాస కేంద్రానికి తరలించారు.

గూడు చెదిరిన గువ్వలు

- ఇళ్లలోకి వరదనీరు
- పునరావాస కేంద్రాలకు బాధితులు



సిరిసిల్ల సినారె కళామందిరంలో ఆశ్రయం పొందిన వరద బాధితులు

సిరిసిల్ల: సిరిసిల్లలో గురువారం చిన్నబోనాల పెద్దచెరువుకు గండిపడడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. వరదనీరు చుట్టుముట్టడంతో ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని వెంటనే స్పందించిన మున్సిపల్, పోలీసు అధికారులు చాలా మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. గురువారం రాత్రి భోజనం ప్యాకెట్లు అందించారు. శుక్రవారం ఉదయం వరద బాధితులు తమ ఇళ్లు ఎలా ఉన్నాయోనని చూసేందుకు పునరావాస కేంద్రాన్ని వీడి వెళ్లారు. ఇల్లును శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. 70 మందికి ఆశ్రయం కల్పించగా ఓ పది మాత్రమే శుక్రవారం ఉదయం ఉన్నారు.

కూలిన ఇళ్లు.. సాంచాల్లోకి నీళ్లు

జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో 25 ఇళ్లు కూలిపోయాయి. మట్టిగోడలతో ఉన్న పాత ఇళ్లు పోచమ్మ వాడలో ఒక్కటి కూలిపోగా.. మత్స్యకారులకాలనీలో మరో ఇల్లు కూలింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రేకుల షెడ్లు కూలిపోయాయి. వెంకంపేట, సర్దార్‌నగర్, ప్రగతినగర్, సంజీవయ్యనగర్, శాంతినగర్ ప్రాంతాల్లో సాంచాల కార్ఖానాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ఆ వరదనీటితో వచ్చిన బురదను తొలగించే పనిలో ప్రజలు ఉన్నారు. సిరిసిల్లలో గెరువు ఇవ్వడంతో సామాన్యుల జనజీవనం యథావిధిగా సాగింది.



భోజన ప్యాకెట్లు అందిస్తున్న కమిషనర్ సమ్మయ్య



పోచమ్మ గల్లీలో కూలిన మట్టి ఇల్లు



గంగపుత్రుల కాలనీలో కూలిన ఇల్లు

గెరువిచ్చిన వాన.. ఊపిరిపీల్చుకున్న ప్రజలు

- చందుర్తిలో అత్యధికంగా 122.6 మిల్లీమీటర్లు
- బోయినపల్లిలో అత్యల్పంగా 41.3 మిల్లీమీటర్లు
- మత్తడి దూకుతున్న చెరువులు 398

సిరిసిల్ల: జిల్లాలో ముసురువర్షం శుక్రవారం కాస్త గెరువిచ్చింది. ఉదయం తుంపర వర్షం పడినా.. మధ్యాహ్నం వరకు ఆగిపోయింది. దీంతో జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న ముసురు వర్షాలు కరువు తీరేలా వర్షం కురిసింది. సాధారణ వర్షాలకు మించి కొట్టడంతో జిల్లాలోని మిడ్‌మానేరు, నర్మాల ఎగువమానేరు, నిమ్మపల్లి మూలవాగు జలాశయాలు నిండిపోయాయి. జిల్లాలోని 398 చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. 75 నుంచి 100 శాతం మేరకు 183 చెరువుల్లో నీరుచేరింది. 50 నుంచి 75 శాతం మేరకు 58 చెరువులు నిండాయి. 25 నుంచి 50 శాతం మేరకు 8 చెరువులు నిండాయి. 0 నుంచి 25 శాతం మేరకు 9 చెరువులున్నాయి. జిల్లాలో 656 చెరువుల్లోనూ జలకళ ఉట్టిపడుతోంది. జిల్లాలో వర్షాలు తగ్గడంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

చందుర్తిలో అత్యధికంగా 122.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా బోయినపల్లిలో 41.3 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 111.3, వేములవాడ రూరల్‌లో 48.8, వేములవాడలో 64.1, సిరిసిల్లలో 97.4, కోనరావుపేటలో 74.4, వీర్నపల్లిలో 112.0, ఎల్లారెడ్డిపేటలో 93.4, గంభీరావుపేటలో 68.8, ముస్తాబాద్‌లో 103.1, తంగళ్లపల్లిలో 95.6, ఇల్లంతకుంటలో 62.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

రైతులకు పరిహారం చెల్లించాలి



మామిడిపల్లిలో వరదలకు కొట్టుకుపోయిన పొలాలను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వేములవాడ రూరల్ మండలంలోని లింగంపల్లి, బొల్లారం, జయవరం, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మూలవాగు పక్కన వేసిన వరి, పత్తి పంటలు నీటి ప్రవాహంతో పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, నాయకులు సామ తిరుపతిరెడ్డి, రవీందర్‌గౌడ్, మల్లారెడ్డి, రవి, శ్రీనివాస్, ప్రభాకర్, నర్సయ్య తదితరులున్నారు.

జిల్లా మునిగితే పట్టించుకోరా?

సిరిసిల్లటౌన్: జిల్లా వరదల్లో మునిగి, ప్రజలు కష్టాల్లో ఉంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ పట్టించుకోరా అని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు జలమయమయ్యాయని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు పదేపదే ముంపునకు గురవుతుంటే మంత్రి శాశ్వత పరిష్కారం చూపడం లేదని మండిపడ్డారు. పంట, ఆస్తి నష్టంపై అధికార యంత్రాంగంతో అంచనా రూపొందించి, బాధితులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లి, బావుసాయిపేటల్లో పర్యటన

కోనరావుపేట: వర్షాల కారణంగా నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేట గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వర్షాలకు నీటమునిగిన పంటలు, మామిడిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లి, బాధిత రైతులతో, మహిళలతో మాట్లాడారు. వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతున్నా ఇప్పటివరకు ఎవరూ రాలేదని వారు తెలిపారు. దీంతో ఆయన ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడగా తహసీల్దార్‌ను పంపించారు. సుమారు 300 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందన్నారు. అధికారులు నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, నాయకులున్నారు.

కోతకు గురైన రోడ్డు పరిశీలన



మాట్లాడుతున్న రవీందర్‌రావు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లిలోని పెద్ద వాగుపై నిర్మించిన నూతన బ్రిడ్జిని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోతకు గురైన ప్రాంతంలో మట్టిని పోసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, డీఈ నాగరాజు, తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, ఎంపీడీవో నరేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ ప్రవీణ్, సెస్ డైరెక్టర్ మల్లేశం, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ బోయిని రవి ఉన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించిన సర్పంచ్



నిరాశ్రయుల తరలింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వరుసగా రెండు రోజులపాటు వర్షాలు కురవడంతో నివాసయోగ్యంగా లేని వారికి తన ఫంక్షన్‌హాల్ ఆశ్రయం కల్పించారు ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి. ఎల్లారెడ్డిపేట పరిధిలోని కిషన్‌దాస్‌పేటకు చెందిన ముద్దం నడిపి ఎల్లయ్య,, బీపేట భూమయ్య కుటుంబాలకు తన ఫంక్షన్‌హాల్‌లో ఆశ్రయం ఇవ్వడంతోపాటు మూడు పూటల భోజనానికి ఏర్పాట్లు చేశారు. వర్షాలు తగ్గే వరకు ఫంక్షన్‌హాల్‌లోనే ఉండాలని తెలిపారు. ఈమేరకు వారిని ఉపసర్పంచ్ దంపతులు ఒగ్గు రజితబాలరాజుయాదవ్ ఆటోలో తరలించారు.

పోలీసుల అదుపులో కేటుగాడు?

- కోట్ల రూపాయలు కొట్టేసిన ఘనుడు
- అంతర్‌రాష్ట్ర బ్లఫ్ మాస్టర్ అవతారం
- అందినకాడికి దోచుకున్న వైనం
- లబోదిబోమంటున్న బాధితులు



రమేశ్‌చారి

సిరిసిల్లక్రైం: ఈజీ మనీకి అలవాటుపడ్డ ఒకరు కోట్ల రూపాయలు వసూలు చేసిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. కరీంనగర్ జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్‌కు చెందిన రమేశ్‌చారి రాష్ట్రంలోని వందలాది మందికి కుచ్చుటోపి పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగాల పేరిట డబ్బులు తీసుకున్నట్లు ఆధారాలు ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఆర్థికంగా ఉన్న వారే లక్ష్యంగా మోసాలకు పాల్పడ్డాడు. మొదట కరీంనగర్‌లో కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర సలహాదారుడిగా పరిచయాలు పెంచుకుని దందా షురూ చేసినట్లు బాధితులు సిరిసిల్ల పోలీసు స్టేషన్ ఆవరణలో మీడియాకు వెల్లడించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ప్రస్తుతం వేములవాడలో నివసిస్తున్న రమేశ్‌చారి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మధ్యవర్తితో వేములవాడలోని ఓ బట్టల వ్యాపారికి రమేశ్‌చారికి పరిచయం ఏర్పడింది. మంచి వ్యాపారం ఉందని.. ముందు కొన్ని టీవీలు, ఫోన్లు ఇచ్చి వాటిని విక్రయిస్తే 50 శాతం లాభం వస్తుందని నమ్మబలికాడు. తర్వాత బంగారం, ఎలక్ట్రానిక్స్ వస్తువుల వ్యాపారం చేద్దామని మరింత మంది భాగస్వాములు కావాలని కోరాడు. నమ్మిన వేములవాడ వాసి తనకు తెలిసిన అనేక మంది వద్ద లక్షల్లో అప్పు చేసి బిజినెస్‌లో పెట్టాడు. కానీ వాటికి సరిపడ వస్తువులు తిరిగివ్వకపోగా..మరింత సొమ్ము ఇస్తే ఒకేసారి ఇచ్చేస్తానని రమేశ్‌చారి నమ్మబలికాడు. చేసేదేమి లేక మరికొందరిని భాగస్వాములుగా చేసుకున్న వేములవాడవాసి రమేశ్‌చారికి ఏకంగా రూ.కోటిన్నర వరకు ఇచ్చాడు. బిజినెస్‌లో పెట్టుబడులు పెట్టిన వారు వేములవాడ వాసిని ఒత్తిడి చేయడంతో విషయాన్ని కరీంనగర్‌లోని మరో బాధితుడికి తెలిపాడు. ఇలాంటి వాళ్లు 50 మందికి పైగా ఉన్నారని, రమేశ్‌చారి చేతిలో మోసపోయిన వాళ్లందరు వాట్సాప్ గ్రూప్ ఉందని అందులో వేములవాడ వాసిని చేర్చడంతో ఖంగుతిన్నాడు. ఇలాంటి వాడిని వదలవద్దని భావించి సిరిసిల్ల రూరల్ ఏరియాలోని మరో బాధితుడు ముందుకొచ్చి హైదరాబాద్‌లో ఉన్న రమేశ్‌చారిని పోలీసులకు పట్టించాడు. సిరిసిల్లలోని ఓ పోలీసుస్టేషన్‌లో విచారిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లు వసూళ్లు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసు అధికారులను వివరణ కోరగా.. విచారణ జరుగుతుందని, వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఉపాధి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడఅర్బన్: ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లతో ఉపాధి పొందాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. వేములవాడ మండలంలోని సంకెపల్లి, రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్‌ఎంఈ) కింద లబ్ధిదారులు నెలకొల్పిన యూనిట్లను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. సంకెపల్లిలోని ఆయిల్‌మిల్లు, రుద్రవరంలోని పిండిగిర్నీ యూనిట్లను పరిశీలించారు. యూనిట్ స్థాపన లాభదాయకంగా ఉందని లబ్ధిదారులు తెలిపారు. యువత ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పరిశ్రమల స్థాపనకు ముందుకురావాలని కోరారు. ఒక్కో గ్రామంలో కనీసం రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉండాలన్నది తమ లక్ష్యమన్నారు. ఈ స్కీం ద్వారా గరిష్ఠంగా రూ.10 లక్షలతో వ్యక్తిగత యూనిట్ల స్థాపనకు ముందుకొచ్చే వారికి 35 శాతం రాయితీ, స్వయం సహాయక సంఘాలు, సొసైటీలు గరిష్ఠంగా రూ.10 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలను స్థాపించవచ్చని తెలిపారు. అనంతరం వేములవాడ మండలం చంద్రగిరి రైతు కడమంచి దుర్గవ్వ ఆయిల్‌పామ్ క్షేత్రాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. డీఆర్డీవో గౌతంరెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వరదల పాపం రాష్ట్ర పాలకులదే

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి
- లోతట్టు ప్రాంతాల ప్రజలకు పరామర్శ

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం వరదల్లో చిక్కుకున్న పాపం తొమ్మిదేళ్లుగా పాలిస్తున్న రాష్ట్ర బీఆర్ఎస్ పాలకులదేనని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. జలదిగ్బంధంలో ఉన్న సిరిసిల్ల పట్టణంతోపాటు విలీనమైన గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి, ప్రజలను పరామర్శించారు. సిరిసిల్లను డల్లాస్ చేస్తామన్న మంత్రి కేటీఆర్ మాటలు ఉత్త కోతలేనని విమర్శించారు. సిరిసిల్ల పట్టణం వరద నీటిలో మునిగితే ఇక్కడి ఎమ్మెల్యే, మంత్రి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వైఫల్యాలపై కాంగ్రెస్ పార్టీ తరపున పోరాడుతామన్నారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించాలని అధికారులను కోరారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చొప్పదండి ప్రకాశ్ తదితరులున్నారు.

లోతట్టు ప్రాంతాల పర్యటన..

సిరిసిల్లలోని వెంకంపేట, ముష్టిపల్లి, ఈదులచెరువు తదితర లోతట్టు ప్రాంతాల్లో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పర్యటించారు. వరద బాధిత ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేలా పోరాడుతామని పేర్కొన్నారు.

రాచర్లగొల్లపల్లిలో తల్లీకుమారుడి అదృశ్యం

- కేసు నమోదు



పోచమ్మ, కార్తీక్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన తల్లీకుమారుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. రాచర్లగొల్లపల్లికి చెందిన కాటికాపల పోచమ్మ అనే యువతి గతేడాది భర్త నుంచి విడాకులు తీసుకుంది. అప్పటినుంచి తన ఐదేళ్ల కుమారుడు కార్తీక్‌తో కలిసి తల్లిగారింట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటలకు బస్టాండ్‌లో పని ఉందని చెప్పి, కుమారుడిని తీసుకొని వెళ్లి, కనిపించకుండా పోయింది. కుటుంబసభ్యులు రెండు రోజులు గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోచమ్మ తల్లి దుర్గవ్వ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, తల్లీకుమారుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉప్పొంగిన మానేరు వాగు



పదిర వద్ద వరద ప్రవాహం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్, పదిర, వెంకటాపూర్ గ్రామాల మీదుగా ప్రవహించే మానేరు వాగు వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. మొన్నటివరకు నీరులేక బోసిపోయిన వాగు ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఫలితంగా వరి పొలాలు నీటమునిగాయి. పదిరలో వైకుంఠధామం, అక్కడే వాగులో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వరద నీటిలో మునిగాయి. మానేరు పరివాహక ప్రాంతంలో ప్రజల ఇబ్బందులు పడుతున్నారు.

జడ్జిని అంటూ మోసాలు

- నకిలీ వేషగాడి ఆటకట్టు
- గన్‌మెన్‌తో సహా అరెస్టు
- పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం

హైదరాబాద్: అసిస్టెంట్ జిల్లా న్యాయమూర్తిని అని చెబుతూ పలు రకాల మోసాలకు పాల్పడుతున్న ఓ నకిలీ ఆట కట్టించారు పోలీసులు. వివరాలను మల్కాజిగిరి డీసీపీ ధరావత్ జానకి, ఎస్ఓటీ డీసీపీ గిరిధర్, ఏసీపీ నరేశ్‌రెడ్డిలు శుక్రవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కరీంనగర్ జిల్లా వేములవాడ ప్రాంతానికి చెందిన నామాల నరేందర్(31) వృత్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం. ఇతడు తాను అసిస్టెంట్ జిల్లా జడ్జిని అని అబద్ధం చెప్పి... అనంతపురం జిల్లాకు చెందిన మాజీ సైనికుడు చిక్కం మధుసూదన్‌రెడ్డిని గన్‌మెన్‌గా నియమించుకున్నాడు. నిత్యం రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు. 2021లో వనస్థలిపురానికి చెందిన గార్లపాటి సోమిరెడ్డితో తాను జడ్జిగా పరిచయం చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం ఖానాపూర్‌లో సోమిరెడ్డికి సంబంధించిన భూమి పేరు మార్పిడి చేయిస్తానని అతని వద్ద రూ.10 లక్షలు తీసుకున్నాడు. సంవత్సరాలు గడిచినా పనిచేయడం లేదు. అడిగితే తప్పించుకుని తిరుగుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం నామాల నరేందర్, గన్‌మెన్‌గా ఉన్న చిక్కం మధుసూదన్‌రెడ్డిలను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో నామాల నరేందర్ న్యాయమూర్తి కాదని తేలింది. అలాగే గన్‌మెన్ వద్ద ఉన్న పిస్టల్‌కు లైసెన్స్ లేదని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి షార్ట్ వెపన్, ఐదు రౌండ్ల బుల్లెట్స్, రెండు మ్యాగ్జిన్స్, కారు, నకిలీ ఐడీ కార్డులు, విజిటింగ్ కార్డు, నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నరేందర్ నేర చరిత్ర

డిగ్రీ వరకు చదువుకున్న నరేందర్ జల్సాలకు అలవాటు పడ్డాడు. గతంలో 9 కేసుల్లో నిందితుడు. జైలు శిక్ష అనుభవించి వచ్చాడు. 2014 నుంచి 2016 వరకు హైదరాబాద్, సైబరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో చోరీలకు పాల్పడి పోలీసులకు చిక్కాడు. 2017లో ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పీడీ యాక్టు నమోదు చేశారు. 2018లో జైలు నుంచి వచ్చి ఖమ్మం వెళ్లాడు. తాను అసిస్టెంట్ సివిల్ జడ్జిగా ప్రమోట్ చేసుకున్నాడు. అమాయకులను నమ్మించి మోసం చేస్తూ వస్తున్నాడు.